# అక్కరకుందికీ అక్కమొగుడు

రాయలసీమ చిన్నోణ్ణి
రాళ్లమద్దె బతికేవాణ్ణి
రాగాలే ఎరగక పాయ్‌నా
అనురాగానికి అందేవాణ్ణి!
ఎండి పోయినా నేలగుండెను
చీల్చి వెడలినా గరికను నేను!
మోడు వారిన చెట్టు కొమ్మలో
మోసులెత్తిన చివురును నేను!
రాళ్లమద్దె రాపిడితోనే
రాజు కొన్న వెలుగును నేను!
నా సీమ బతుకుల చింతన చేసె
కవుల చేతి కలమును నేను!-

అంటా ఈ గడ్డ మింద పుట్నోళ్ల బాదలన్నీ నాబాదగా ఎప్పుడన్నా యాడన్నా ఎలబోసుకుంటే-

''యాడికొచ్చినా పెద్దసీమ మాదిర్తో ''నా సీమ! నా సీమ!!'' అని ఈడి ఏడుపు

ఏడుపుగానే ఉండాదే? ఇంకెవుడికీ ఊరూనాడు లేనట్టు. ఈడికొకడికే ఉణ్ణెట్టు!'' అని యాసణ్ణం పడ్తా ఉంద్రి.

బాదలు పడే వాడికే బాదంటే తెలిస్తింది. బయటుండి బడాయి కొట్టే వాళ్లకేం తెలిస్తింది? నెమిలి కంట్లో నీళ్లు గార్తే యాటగాడి కేమన్నా ముద్దా? అని సరిపెట్టుకుంటా ఉంటి. సరిపెట్టుకోకుండాపోతే యింకేం చెయ్యాల? ఇదేం నా వొకడి ఏడుపా? ఒక నాటి ఏడుపా? తాత ముత్తాతల కాలం నుంచి తర తరాలుగా యాడస్తావుండే ఏడుపే గదా?

ఎవుడి ఏడుపు వాడిదిగా ఉండే ఈ కాలాన ఈళ్లేడుపు! – ఎవుడికి యినిపిస్తింది? ఇనిపించినా ఈళ్లతోగూడా కూసోని ఏడ్సే దానికి ఎవుడికి తీరుబాటు ఉంటింది. ఒకేళ తీరుబాటు ఉణ్ణిందే అనుకో ఎవుడికేం గాచ్చారం పట్టింది?

అట్టని ఊరికే యిడ్సి పెట్టేసే దానికి అవితిందా? చేతులు ముడ్సుకోని కూసుండే దానికి వొప్పితిందా? అయినా మనేడుపు మనం యాడస్తా ఉంటే ఎవుడి చెవల్లో అయినా పడకుండా పోతిందా? ఎప్పిటికో ఒకప్పిటికి ఎవుడన్నా కడుపుకు కూడు తినే మహాన్నబావుడు కలగచేసుకోకుండా పోతాడా? మన కష్టాలు కడతేరకుండా పోతాయా? అని యాడస్తావుంటే ఈ పొద్దు శానా మంది ఈది నాటకంలో ఎనక పాటగాళ్ల మాదిర నా ఏడుపు అందుకుణ్ణారు. ఇంకేం పరవాలేదబ్బా? అందురు కల్సి యాడస్తా ఉంటే యింక మిందట మనం యాడవాల్సిన పని వుండదని శానా కుశాలేసె.

అయినా ఇల్లు అలగ్గానే పండగైపోతిందా? ఈ రాళ్ల సీమలో మణుసులుండారే? ఉత్త ఉబ్బలమారోళ్లు. అట్ట ఉబ్బిస్తే చాలు. దయిర్నంగా పబ్బం గడుపుకోవచ్చు. ఈళ్ల సమాచారం ఎవురికి తెల్సి ఎవురికి తెలవకుండా పాయ్‌నా ఈ సీమలో పుట్నె నాయకులందరికీ శానా బాగా తెల్సు. అందుకే ఇప్పుడు ఉబ్బకొట్టాల్నే గానీ లబ్బరు – లబ్బరు బుడ్డలు ఉబ్బినట్టే గదా? ఉబకనెత్తినాక ఊరికే ఉండమన్నా ఉండే స్వబావికం గాదే? అయినా ఎన్ని సార్లు ఇట్టా మాదిర ముందు పళ్లా? ముందు పణ్ణెట్టే పడి ఎనిక్కొచ్చెయ్‌లా. ఈ సారి మాత్రం కొంచిం తెంపుగానే తెపరాయిస్తా ఉండారు. ఏమయితిందో చూడాల మల్లా.

ఈళ్ల కతలు ఇట్టుంటే ఇంక పత్రికలు. పత్రికలంటే చీగిట్లో ఉండే జనాలకు చేతల్లో దివిటీలు! అవ్వి దోవ చూపిస్తా వుంటే జనం ఎనకన్నే నడవాల. ఈ దేశింలో కత అట్ట కాక పాయనే. పత్రికలు ఎప్పుడు పది మందికి ఎనకనే ఉంటాయి. అటుమంటివి సీమకు అన్నాయం జరిగిపోతా ఉండాదని పోటా పోటీగా ముందు పణ్ణాయి.

ఒక్క మోపన అదిం పట్టి రాసేస్తా ఉండాయి.

మన నాయకులు తిండి నీళ్లు యిడ్సి పెట్టేసి పోరకలాడ్తా ఉండారు. కూడా మాడా మేమూ ఉండామంటూ ప్రెజలు గోసి పేతలు ఎగచెక్కతా ఉండారు. ఎనక పాట మాకు వొదిలి పెట్టండి? అంటా పత్రికలు ముందుకొచ్చినాయి. ఇంకేం పరవాలే. ఈ సీమకు పట్టిన శని ఇంక ఇరగడై పోతింది. అని మీసం మింద చెయ్యేసినా. మిద్దూరికి ఎలబార్నా!

ఎలబార్తే పూలదండలు ఎత్తుకోని అయిద్రాబాద్‌కు ఎలబారాల. అట్టగాకుండా మిద్దూరికి ఎందుకంటారేమో! మీకు తెలియందని కాదు. ఆ కొంపల్లో కుప్ప గొడ్తా ఉండేటోళ్లు ఊరి మింద ఊరు పడిందంటే ఉలిక్కి పడరు. కొండ మింద కొండ పడిందంటే వాళ్ల గుండె కలుక్కుమనదు. పొద్దు పుట్టేది పొయ్యేది తప్పితే రొండోది వాళ్లకు తెల్దు.

కండ్లు నులుముకుంటా నిద్దర లేసేది. కాడి మాను మడకెత్తి బుజాన పెట్టుకుండాది. పొద్దుగూకులూ ఆ జానా బిత్తెడు కయ్యల్లో ఎద్దలగొట్టేది. ఉంటే- యాళకంత ముద్ద తినేది. అది గూడా నాలుగు చినుకులు రాల్తేనే గదా? రాలకుండా బోతే తలకాయ పైకెత్తి నోరు తెర్సుకోని ఆకాశం కల్లా చూసుకోనుండేదే పని.

''ఇంక అట్టా మాదిర ఆకాశం కల్లా చూడాల్సిన పనేలే. సీమలో చినుకు రాలిందా? లేదా? అని చింతన చెయ్యాల్సిన పన్లే. సొర్ణముకి పార్లేదు. రాయల చెరువులోకి చారడు నీళ్ల రాలేదు. అని యాదన పడాల్సిన పనేలే. మొనగోళ్లు మెళ్లో పూలేసుకుణ్ణారు. కిష్ణమ్మ తల్లిని తెస్తారు. ఇంక మోట కట్టాల్సిన పన్లే. మోటారెయ్యాల్సిన పన్లే. మీకష్టాలన్నీ తీరి పొయ్‌నట్టే! ఇప్పుడు మాత్రం మీరు యామార బాకండి. శానా జాగర్తగా ఉండాల. రాయలసీమలో దెబ్బతో చెట్టు కదలాల. పుట్ట కదలాల. రాయి కదలాల. రప్ప కదలాల. ఆ కాడికొస్తే ఓట్లు ఏసిన సేతల్తోనే రాళ్లేసే దానిగ్గూడా ఎనకాడ బాకండి.''

-అంటా మిద్దూర్లో ఆ చుట్టు పక్కల ఊళ్లల్లో ఎచ్చిరిక చేసివద్దామని ఎలబార్తి. మద్దేణాల కాడ ఎగబడి పోతా వుండే ఎర్ర బస్సులో గుంట కట్టమింద దిగబడ్తి!

ఆ గుంట కట్టమింద ఒక జాతర జరిగినట్టుండాది. ఆ చుట్టూ పక్కల ఊళ్లల్లో జనమంతా అణ్ణే ఉండారు. ఏందబ్బా కత అంటే?- కొలిమి చింత మాని కింద ఒక సిబిరం. ఆ సిబిరంలో నిరాహార దీచ్చలో పది ఇర్వై మంది. అది గూడా ఈ టవున్లల్లో మాదిర రిలే గిలే గాదంట. చచ్చేదో బతికేదో ఏదో వొగిటి తేల్సు కోవాలనే కూసుణ్ణారంట!

ఆ మాట ఇంటా వుంటే నా ఎదుర్రొమ్ము మింది ఎంటికలు ఎగబొడ్సుకోని లేసె!

గబ గబా సిబిరం కాడికి నడిస్తి. వాళ్లందురి కల్లా చూస్తా ఉంటే నా కండ్లల్లో కనకాంబరాలు పూసె. మెళ్లో ఒక మోమిన సందిడు లావు పూలదండ ఏసుకోని కొండారెడ్డి మామ అవుపించే కుందికీ నా ఒళ్లే నాకు తెల్లా!

ఎందుకంటే కొండమామ శానా అగుటీటం పట్టిన మణిసి. మనకు సొతంత్రం వొచ్చి నలబై ఏండ్లకు పైబడింది గదా? ఎన్నో ఎలక్సన్లు జరిగుంటాయి గదా? ఆ మణిసి గానా ఓటేసి ఉంటే ఒట్టు!

''ఓటేసి వద్దువుగానీ రా మామా?'' అంటే -

''నాకేడ తీరుబాటవితింది గానీ నువ్వు పోరా అబ్బూరే?'' అంటాడు.

''పోనీ! నీ బొదులు ఒక కూలి మణిసిని పెడ్తాం. నువ్వు రారాదా మామా?'' అంటే-

''అంత పని ఎందుకు లేరా? నా పని నేను చేసుకుంటే వొచ్చే తృప్తి ఓటేస్తే వొస్తిందా? ఓయబ్బా! కూలి సేద్దానికి సొంత సేద్దానికి ఎంతరా వారా ఉండేది? ఈ మాత్రం తెలవకుండా పోతే ఎట్రా?'' అన్నెట్లుగా చూస్తాడు.

''ఓటు శానా యిలవయింది మామా! దాన్ని ఉర్దాగా పోనిస్తే ఎట్టా?'' అంటే-

''పోనీరా! మీ మాటకే వస్తా. అంత యిలవైన ఓటేస్తే మల్లా నేనీ మడక దున్నే పనేమైనా తప్పో పోతిందా? తొలి కోడి కూసే యాళకాడ మోటదోలే పనేమన్నా తొలిగి పోబోతిందా? లేదు. ఏసేసి వచ్చినాక ఎవుడన్నా వొచ్చి నాకొక కుచ్చుల కుళ్లాయి పెట్టేసి పోబోతాడా? లేదే! ఏసి మీరేమి వారుకుణ్ణిందీ లే. ఎయ్‌కుండా నేను పోగొట్టుకుణ్ణింది లే. నువ్వు పదరా అబ్బా రే!'' అని సందుపోకుండా మాట్లాడి సాగనంపే మణిసి ఈ పొద్దు చింత చెట్టుకింద సిబిరంలో కూసుణ్ణాడంటే- ముంతకు కాళ్లొచ్చినట్లే కదా? అందుకే చక్కాపొయ్ కొండారెడ్డి మామ పక్కన కూసుంటి.

నన్ను చూస్తానే మామ మీసాల సందుల్లో ముసి ముసిగా నవ్వె!

''మామా! ఈ పొద్దు నాకెంత సంతోసంగా ఉండాదంటే కిష్ణ నీళ్లు దోసిళ్లతో ఎత్తెత్తి తాగినంత సంతోసంగా ఉండాది మామా''

''నాకు అంతకు మించినట్టుగా ఉండాదిరా అల్లుడా! నేను అంత పిలగాడుగా ఉండేటప్పుడు మాయవ్వ తాత బెజవాడ కనక దుర్గను చూడాలని పొయ్యిండ్రి. వస్తా వస్తా వాళ్లొక రాగిచెంబు నిండికి కిష్ణ నీళ్లు తెచ్చిరి. ఆ నీళ్లను ఇంట్లో అందురికీ తలా గెంటెడు శార్లళ్లో పోస్తే కండ్ల కద్దుకుంటా తీర్తం తీసుకుణ్ణెట్టు తీసుకుంటిమి. అటుమంటిది ఇప్పుడు నా కయ్య నా కాలవ నా చేను చెట్టూ అంతా కిష్ణ నీళ్లతో తడిస్తిందంటే ఈ జల్మానికి ఇంకేం కావాల్రా?''

''ఈ పట్టుదల యిట్నే ఉంటే..''

''కొండారెడ్డి మామ కత నీకు తెల్సు గదరా? వ్రతం పట్టేదిలే. పడ్తే ఇడ్సిపెట్టేదిలే. మొన్నా బారతం మిట్ట కాడ ఎవుడో ఒకడొచ్చి మీటింగు బెట్టె. మహన్నబావుడెవుడో పొట్టి శీరాములంట. ఆయన చస్తే గానీ మన రాష్ట్రం మనకు రాలేదంట. ఒకడు చస్తే గానీ ఒక పని గాకుండా పొయ్యేటిగా ఉంటే కిష్ణ నీళ్లు వస్తాయంటే నా మాదిరి ఎరి ముండలు ఎంత మంది చస్తే మాత్రం ఏముండాది రా?''

నాకండ్లల్లో నాకు తెలవకుండానే పల పల నీళ్లు రాలె!

''ఒరే పిచ్చోడా! ఏడస్తావెందుకురా? ఈ సీమలో ఇట్టా దినమ్ము చస్తా బతికేదానికంటే ఒకే పార్తో చస్తే అంతకంటే ఇంకేం కావాల్రా? ఏడు మట్ల బావులు పాయ. అట్నే ఎనిమిది మట్ల బావులు పాయ. పది మట్ల బావులు పాయ. ఇప్పుడు నూరడుగుల బోరింగులు... ఇన్నూరడుగుల బోరింగులు... అంటా ఉండారు. ఆడికీ నీళ్లందలా. ఏరు మింద ఏరు పార్నా గుక్కెడు గతుకు నీళ్లే గెతి అన్నెట్టుగా ఎల్లకాలం మన బతుకులు యిట్టా

యడస్తా ఉంటే ఈ పొద్దు కాకుండా పోతే రేపో ఆ మర్నాడో గంప నెత్తికెత్తాల్సిందే గదరా? అది బతకలేని చావు. ఇట్ట చస్తే బతకాలని చావు. ఇది మేలు గదంట్రా?'' అనె.

నాకు నిజింగా ఒకేసారిగా ఎయ్యి ఏనుగుల బలం వచ్చె. వైద్దుడితో పని లేకుండానే రోగానికి మొందు కనుక్కుణ్ణారు. ఇంక నాకు ఆడేం పనుండాది. బస్సెక్కితి. బొళువు మొయ్య లేనట్టుగా అది గూడా పడ్తా లేస్తా పోతా ఉండాది. కొలిమి చింత మాని కింద సిబిరంలో చిగలకపొయ్‌న మణుసును బలింతంగా సోదీనానికి తెచ్చుకుణ్ణా.

ఈళ్లందురుకీ కిష్ణ నీళ్ల కండ్ల చూసేదంటే కూటికే లేనోడు పండగ పూట పరమాన్నం వండుకున్నెట్టుండాది. నిజిమే గదా? కొండారెడ్డి మామే గాదు. కొండల్ను పిండి చేసే వాళ్ల గూడా నీళ్ల లేకుండా పోతే ఇంకేం చేస్తారు? చింతచెట్టు కింద సిబిరం ఏసుకోని చచ్చేదో బతికేదో తేల్సుకుంటారు. ఈ సీమలో కాలితో మడవ తిప్పితే కయ్య పారేదంటే పాణానికంటే పిరింగా ఉండాది.

అయినా ఈ సీమకు పట్నె గెతేందబ్బా? ఈ గెతి దీనికి పట్టాల్సిందేనా? పట్టకేంచేస్తిందిలే? రాయల వారి రాజరికం పొయ్‌నాక ఈ సీమ గెతి ఏడ్సే బిడ్డకు అబ్బ ఎవుడు? అన్నెట్టయిపోలా. మైసూరు నవాబుల డాబులో రొన్నాళ్ల మగ్గె. నైజాం వాడి శాతల్లో నలిగె. వాడుగూడా వొల్సుకుణ్ణె కాడికి వొల్సుకోని దండు తీసుకోని తెల్లోడికి దారాదత్తం చేసె. వాడ్ని ఎట్నోవొకట్టా వదిలించుకుంటే అరవోళ్ల శాతల్లో అగసాట్లు తప్పలా. ఈ అగసాట్లు మనకెందుకు? మన అగసాట్లేమో మనమే పడ్తే పోలా? అనుకోని వారగా వచ్చేస్తే... మహన్నబావులంతా కల్సి వారగానే పెట్టేసిరి. వొరగపెట్నెట్టే వారగా పెట్టేదానికి వొకటా వాళ్లాడింది? ఉద్ధరించేస్తామని పెద్ద మణుసులంతా దేశోద్ధారకుడి యింట్లో చేరి మద్దిస్తం చేసిరి. అది సద్దిబడి పాయ. మనప్ప నీలం సంజీవిరెడ్డి 1947లో మాట్లాడిన మాట డిల్లీలో కూసుణ్ణాక మాట్లాడుంటే యిప్పుడు యీ ఏడుపు ఎందుకుంటింది?

ఇంతకూ మన బంగారం సుద్దంగావుంటే ఒకర్ని అనాల్సిన పనేమి ఉండాదిలే. ఈళ్ల పదవులు మాకే అని. సుద్దంగా వాళ్ల పన్లు చేసుకుంట్రి. లేకుండాబోతే కిష్ణాపెన్నార్ ప్రాజక్టు నాగార్జునసాగర్‌గా మారిపోతిందా? మార్తే మారింది. ఆకాడికీ మేలే. యాణ్ణో ఒక చోట కట్టనన్నా కట్నారు. కాగితాల మిందనే ఉండి పొయ్యింది ఎన్నో?

తరిమి తరిమి కొడ్తిమే తెల్లోణ్ణి. వాడే మేలు గదా? కేసి కెనాలొగిటి తొవ్వించె. కంటితుడుపుకైనా ఆడొగిటి ఆడొగిటి రొండు కాలవలు తొవ్వించె. నలబై ఏండ్లుగా మనోళ్ల పొడ్సి గెల్సింది ఏముండాదని? –

రాయల కాలంలో యాడొక వొరవ ఉంటే ఆడొక చెరువు. దానికింద కాలవలు. వరవలు వంకలు లేని చోట్లల్లో కసిం కాలవలైనా తొవ్వించిరి. వాటినన్నా సుద్దంగా పెట్టుకోని యాడస్తా ఉండారా మనోళ్లు? అంటే లేదే? పాతవాటిని కాపాడు కుణ్ణిందీ లే. కొత్తవాటి జోలికి పొయ్యిందీ లే. తొవ్వతాం తొవ్వతాం అంటా వొగిటేసారిగా గుంతలే తొవ్వేటిగా ఉండాది. కడాన చూపంతా తెలుగుగంగ మీద పెట్టుకోనుంటే చూస్తా చూస్తా ఉండంగానే

జరగాల్సిన మోసం జరిగి పాయ! శాతగానోడు లంజిరికం చేస్తే యింటికి దుగ్గాణి పంపక మంట. అట్టా మాదిర అయ్యే కర్చు అందురి మింద పడ్తే తెలుగుగంగ పాయ్ మట్టిలోతులో నీళ్లుండే మైదానాల మింద పడె. బాగుండ్లా?''

కొండారెడ్డి మామ తలకే యిదంతా ఎక్కిందంటే యింక ఈసీమలో తలకాయి ఉండే వాడికంతా తలకెక్కినట్టే లెక్క. తలకు ఎక్కాల్నేగానీ ఎక్కిందంటే ఎనుకూముందూ చూసే పన్లే. ఇది నాతలకెక్కే కుందికి నా తలకాయి పైకిలేసె. రొమ్ము యిర్సుకోని నాలుగాళ్ల మండపం కాడ నడస్తా ఉంటే ముత్తారెడ్డన్న ఎదురుపడి-

''ఏమిరా అబ్బారే? చుక్కలు చూస్తా ఉండావే?'' అనె.

చూసొచ్చిన కతంతా కాసింత పొల్లుపోకుండా చెప్తే యిని నవ్వుతా-

''ఒరే అబ్బోడా! నువ్వొక తిక్కోడివి. మీ కొండారెడ్డి మామ ఒక ఎర్రోడు. నాటినించి ఈసీమ మన నాయకులకు వొదగతా ఉండాది. అంటే అక్కరకు వొదగతా ఉండాది. ఎట్టంటావా? అవసరం వొస్తే అడ్డం పెట్టుకోని అర్సేది. తీరిపోతే నోరు మూసుకుండేది. చూస్తానే ఉండావుగదా? ఇంత బాగా అక్కరకు వొదగతా ఉండేదాన్ని వదులుకుండేదానికి మణుసు వొప్పితిందా? ఒకేళ దాని తలరాత మార్చేస్తారే అనుకో. మల్లా అక్కర పణ్ణెప్పుడు దేన్ని అడ్డం పెట్టుకోవాల? అందువల్ల దీని గెతి యింతే. వాళ్ల పని అంతే! కుర్సీల కుమ్ములాటల్ను నీకోసరమే నాకోసరమే అనుకుంటే మనంత ఎర్రోళ్లు యింకొకరుండరు. సైబీరియా ఎడార్ని బెమ్మాండంగా సాగుచేస్తా ఉంటే సస్యశ్యామలంగా ఉణ్ణె సీమను ఎడారిగా మార్చేస్తానే 'మార్నిస్తామా? మజాకానా?' అని అర్సేదానికి మనోళ్లకే చెల్లింది. ఉళక్కచ్చి మాట్లకు ఉబ్బిపోతే ఎట్రా?'' అనె ఆయన్న.

ఆమాటతో అవజీవాలు అణిగి పాయ.

ఇదంతా అక్కరకుందికి అక్కమొగుడి యవారంగా ఉండాదే కత! అనుకుంటి. ●